సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



మలేరియాను నిర్మూలిద్దాం
మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. IIIలో



హక్కుల సాధనకు ఐక్యం..
హక్కుల సాధనకు గిరిజనులందరూ ఐక్యం కావాలని అఖిల భారత ట్రైబల్ ఫోరం నాయకులు కోరారు. IIలో

గరిష్టం / కనిష్టం
40° / 25°

వాతావరణం
జిల్లాలో శనివారం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్థిక అవగాహన ఉండాలి
ఆర్‌జీఐ మేనేజర్ సాయితేజ రెడ్డి



మాట్లాడుతున్న మేనేజర్ సాయితేజరెడ్డి

గుండాల : స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అవగాహన పెంపొందించుకోవాలని ఆర్బీఐ బ్యాంక్ మేనేజర్ సాయితేజ రెడ్డి అన్నారు. యాస్పిరేషనల్ బ్లాక్ గుండాల మండలం కాచనపల్లిలో శుక్రవారం నిర్వహించిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక ప్రణాళిక, పొదుపు, వివిధ రకాల పెట్టుబడి సాధనాలు, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, కాచనపల్లి ఎస్బీఐ మేనేజర్ వేణు, కోటేశ్వర రావు, నాగేశ్వర రావు, జగ్యా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఓపెన్' పరీక్షలు
కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 20వ తేదీ నుంచి మొదలైన సార్వత్రిక పీఠం ఓపెన్ ఇంటర్, పదో తరగతి థియరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, శనివారం నుంచి ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

'మిషన్ భగీరథ'ను పరిశీలించిన సీఈ



అధికారులతో మాట్లాడుతున్న సీఈ శ్రీనివాస్

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్‌ను, మిట్టగూడెం రథంగుట్ట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శుక్రవారం మిషన్ భగీరథ సీఈ కే.శ్రీనివాస్ సందర్శించారు. ఇటీవల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో సమ్మక్క–సారక్క బ్యారేజీ నుంచి నీరు దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సీఈ సందర్శించి నీటిమట్టాన్ని పరిశీలించారు. మే నెల వరకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఎస్ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ నళిని, డీఈ మహేందర్ పాల్గొన్నారు.

మలేరియా నివారణ ర్యాలీ
కొత్తగూడెంఅర్బన్: మలేరియాను నివారించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ముర్రేడువాగు నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం సర్వజన ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను సందర్శించి, సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు సుకృత, బాలాజీనాయక్, మధువరన్, ఫయాజ్‌మొహియుద్దీన్, జేతు, హరికిషన్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులనే ఎంపిక చేయాలి



లబ్ధిదారుతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

దమ్మపేట/అశ్వారావుపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులనే ఎంపిక చేయాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. శుక్రవారం దమ్మపేట మండలం అల్లిపల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అర్హుల ధ్రువీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ బృందం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని అన్నారు. దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. నారంవారిగూడెం కాలనీ పంచాయతీలో లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు రవీంద్రా రెడ్డి, రామారావు, స్పెషల్ ఆఫీసర్ జుంకీలాల్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఇతర అధికారులు రంజిత్ కుమార్, అక్షిత, శ్రీనివాస్, శివరాంప్రసాద్, రామకృష్ణ, మురళి, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'పై నజర్

పర్యావరణ అనుమతులపై దృష్టి సారించిన అధికారులు
- 15 నెలలుగా పెండింగ్‌లోనే ఈసీ ఫైల్
- ఈసీ వస్తేనే పనులు చేపట్టాలని ఎన్‌జీటీ ఆదేశాలు
- ఇటీవలే సీతారామకు టీఏసీ నుంచి గ్రీన్ సిగ్నల్



ఎన్‌జీటీ ఆదేశాలతో ఆగిపోయిన సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణ పనులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగు భూములకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా సీతమ్మ సాగర్ పేరుతో గోదావరిపై బరాజ్ నిర్మిస్తోంది. ఈ మేరకు పర్యావరణ అనుమతుల కోసం 2018లో కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసింది. ఆ వెంటనే వివిధ ప్యాకేజీలుగా ప్రాజెక్టు పనులను విభజించి నిర్మాణ పనులు ప్రారంభించింది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు రాకుండానే సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మిస్తున్నారని, గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పొలాలు, అడవులు మునిగిపోతాయంటూ భద్రాచలం ఏజెన్సీకి చెందిన కొందరు వ్యక్తులు 2022 డిసెంబరులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), చెన్నై బెంచ్‌ను ఆశ్రయించారు. దీంతో పర్యావరణంతోపాటు అన్ని రకాల అనుమతులు వచ్చే వరకు ప్రాజెక్టు పనులు ఆపాలంటూ 2022 ఏప్రిల్ 26న ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌జీటీ ఆగ్రహం

గ్రీన్ ట్రిబ్యునల్‌లో వివాదం కొనసాగుతుండగానే రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టింది. దుమ్ముగూడెం, అశ్వాపురంల మధ్య గోదావరి నదిపై 1.5 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. జల విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం కుడివైపున గట్టు నుంచి 200 మీటర్లు వదిలిపెట్టి, మిగిలిన 1.3 కి.మీ పొడవుతో మొత్తం ఆరు బ్లాకులుగా విభజించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో ఒకటి నుంచి నాలుగు బ్లాకుల్లో పియర్లు, స్పిల్‌వేల నిర్మాణం పూర్తయింది. క్రస్ట్ గేట్లు బిగించడమే తరువాయి అనుకునే తరుణంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పట్టించుకోకుండా బ్యారేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయంటూ మరోసారి ఎన్‌జీటీని బాధితులు ఆశ్రయించారు. బరాజ్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యాలను ఫొటోలతో సహా సమర్పించారు. దీంతో ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్కడిపనులు అక్కడే ఆపాలంటూ 2023 మే 29న ఆదేశాలు జారీ చేసింది.

క్షేత్రస్థాయి పరిశీలనకు ద్విసభ్య కమిటీ

క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ ఎన్‌జీటీ ద్విసభ్య కమిటీని నియమించింది. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ శాఖకు చెందిన రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్), గోదావరి నదీ జలాల నిర్వాహణ బోర్డులో ఎస్ఈ స్థాయి అధికారి ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. కమిటీ 2023 జూన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి, జూలైలో నివేదిక అందించింది. అయితే నివేదిక లోపభూయిష్టంగా ఉందంటూ ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పని ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ సూచన చేసింది. పదేపదే తమ ఆదేశాలు ధిక్కరిస్తూ అనుమతులు లేకుండా పనులు చేపట్టడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ గోదావరి రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖలను ఇటీవల ఆదేశించింది. దీనిపై 2023 సెప్టెంబరు 23న ఎన్‌జీటీలో వాదనలు జరిగాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన రావడంతో ఈ అంశం మరుగున పడింది.

ఈసీపై దృష్టి

ఇప్పుడు కీలకమైన పర్యావరణ అనుమతు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్)లు సాధించడంపై దృష్టి సారించాల్సి ఉంది. అందులో భాగంగా నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆ మేరకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అనంతరం గ్రీన్ ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించి, ఈసీ క్లియరెన్స్ వచ్చాక, అపెక్స్ కమిటీ నుంచి మిగిలిన అనుమతులు సాధించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే బరాజ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

డీపీఆర్‌కు లైన్ క్లియర్

అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ వ్యయం, అనుమతులపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. ముందుగా సీతారామకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు, డీపీఆర్)కి కూడా ఎకనామిక్ ఫీజుబులిటీ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు లేని విషయాన్ని గుర్తించింది. దీంతో ముందుగా ఈ రెండు అనుమతులు సాధించడంపై దృష్టి పెట్టింది. 2024 ఆగస్టులో ఈ ప్రయత్నాలు మొదలైతే 2025 ఏప్రిల్ 24న డీపీఆర్‌కు టీఏసీ అనుమతులు కూడా వచ్చాయి.

'భూ భారతి'తో వివాదాలకు చెక్

- అర్హులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు
- సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మునగతోటను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చంద్రుగొండ : భూ భారతి చట్టంతో భూ వివాదాలకు ఇక పుల్‌స్టాప్ పడనుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రెవెన్యూశాఖలో పూర్తిస్థాయిలో యంత్రాంగం ఉంటేనే పనులు జరుగుతాయని, ఆ దిశగా వ్యవస్థను పునర్నిర్మించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంతో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని, భూమికి నక్షాతో కూడిన పాస్‌బుక్‌లు వస్తాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందన్నారు. కుటుంబాల్లో సైతం ఏర్పడే భూ వివాదాలకు ఇక ఆస్కారం ఉండబోదన్నారు. భూ వివాదాల్లో గతంలో కోర్టును ఆశ్రయించేవారని ఇకపై ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కారం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమించి రికార్డులు సృష్టించుకుంటే విచారించి రద్దు చేసే అధికారం భూభారతి చట్టం ద్వార రెవెన్యూ అధికారులకు లభించిందన్నారు. అనంతరం పలువురు రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం గ్రామంలో మునగతోటను కలెక్టర్ పరిశీలించారు. రైతు చాపలమడుగు నాగేందర్‌తో మాట్లాడి సేద్యం చేస్తున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకుని అభినందించారు. మునగ, ఆయిల్ పామ్ సేద్యం వైపు రైతులు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ మధు, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏఓ వినయ్, సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు పాల్గొన్నారు.

పెట్రోలింగ్, గస్తీ పెంచాలి

- ఇల్లెందు పోలీసుల పనితీరు అభినందనీయం
- ఎస్పీ రోహిత్‌రాజు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇల్లెందు: వేసవి కాలం దృష్ట్యా చోరీ సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ పెంచాలని, బ్లూకోల్ట్స్ సిబ్బంది గస్తీ పెంచాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన ఇల్లెందు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను, కంప్యూటర్ గదిని, లాకప్‌లను పరిశీలించారు. నిఘా వ్యవస్థ పనితీరుపై ఆరా తీశారు. ఇటీవల ఓ చోరీ సంఘటనను ఛేదించి 29 తులాల బంగారం రికవరీ, ఓ పోక్సో కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసినందుకు పోలీసులను అభినందించారు. ఇల్లెందు పోలీస్ యంత్రాంగం పని తీరు జిల్లాలోనే టాప్ లెవల్‌లో ఉందని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కష్టాల్లో ఉండి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితులకు తక్షణ న్యాయం అందాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా తీవ్రతరం చేయాలని, పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని, విస్తృతంగా సభలు సమావేశాలు పెట్టి చైతన్యపర్చాలని సలహా ఇచ్చారు. బెట్టింగ్, గంజాయి సరఫరా మీద ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు పి. శ్రీనివాసరెడ్డి, బి. సూర్య, సిబ్బంది ఉన్నారు.

నిలిచిన ఉపాధి పనులు

సుజాతనగర్: కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్, నాయకులగూడెం, నిమ్మలగూడెం, కోమటిపల్లి, మంగపేట, లక్ష్మీదేవిపల్లి, నర్సింహసాగర్ గ్రామాల్లో శుక్రవారం నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఈ ఏడు గ్రామాల పరిధిలో 4,096 జాబ్ కార్డులు ఉండగా, 8701 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి కూలీలు 4,09,600 పని దినాలను కోల్పోయారు. 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభం నాటినుంచి 20 ఏళ్లుగా ఉపాధి పనులతో కుటుంబాలను నెట్టుకొస్తున్న కూలీలు తాజా పరిణామంతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. నేడు భూ భారతి చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సుకు కలెక్టర్ రానుండగా, తమకు ఉపాధి కల్పించాలని విన్నవిస్తామని విలీన పంచాయతీల ప్రజలు పేర్కొంటున్నారు.

కార్పొరేషన్ సరే.. సమస్యల సంగతేంటీ..?

- మున్సిపల్ కార్పొరేషన్‌తో పెరిగిన కొత్తగూడెం హోదా
- త్వరలో జీఓ విడుదలయ్యే అవకాశం
- గూడెం, పాల్వంచ పట్టణాలను వేధిస్తున్న సమస్యలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవ అవసరం



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వాగతిస్తున్న ప్రజలు అక్కడి సమస్యల సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక అవస్థ పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం నోటిఫైడ్ ఏరియా నుంచి క్రమంగా కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను విలీనం చేస్తూ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. రేపోమాపో జీవో విడుదల అయితే పూర్తిస్థాయిలో కార్పొరేషన్‌గా మారనుంది. 1971లో నోటిఫైడ్ ఏరియాగా పాలన ప్రారంభమైంది. 1995లో ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం 2000 సంవత్సరంలో 79,721 మంది జనాభా కలిగి ఉండగా, 33 వార్డులకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు కౌన్సిల్ ఎన్నికలు జరగ్గా, నాలుగుసార్లూ మహిళలే మున్సిపల్ చైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం గెజిట్ విడుదల కాగా, జీఓ విడుదలయ్యాక పూర్తిగా కార్పొరేషన్‌గా మారనుంది. అనంతరం స్పెషల్ ఆఫీసర్ నియామకం, డివిజన్ల ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు.

రెండు పట్టణాల్లో పేరుకుపోయిన సమస్యలు

కార్పొరేషన్‌లో భాగంగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ప్రజలను సమస్యలు వేధిస్తున్నాయి. సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 20 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లు చెక్కు చెదరకుండా ఉంటే, రెండు, మూడేళ్ల క్రితం నిర్మించిన రోడ్లకు పగుళ్లు వస్తున్నాయి. పెచ్చులు ఊడిపోతున్నాయి. అధికారుల అవినీతి, నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కిన్నెరసాని ప్రధాన పైపులైన్ పగలడం, లీకవడంతో కొత్తగూడెం ప్రజలకు తరచూ తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. పట్టణంలో పార్కింగ్ జోన్ లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్లపై వాహనాలు నిలిపితే పోలీసులు జరిమానా విధిస్తున్నారు. పట్టణంలో చెప్పుకోదగిన పార్కులు లేవు. ఉన్న పార్కులు సౌకర్యాలు లేకపోవడంతో వృథాగా మారుతున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పార్కు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. రామవరంలోని ఏడు వార్డులకు దశాబ్దాలుగా క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వడం లేదు. ఇక రోడ్ల విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. పాల్వంచ మున్సిపాలిటీలో దశాబ్దాలుగా ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది.

తొలుత పన్నులు పెరుగుతాయి..

కొత్తగూడెం కార్పొరేషన్‌తో ఇక్కడి ప్రజల 20 ఏళ్ల కల నెరవేరింది. అదే తరుణంలో కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు, పంపు బిల్లులతో పాటు భూమి ధరలు కూడా పెరుగుతాయి. ఇప్పుడున్న ఆస్తి విలువ రెట్టింపయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్‌లో అధికారులు, సిబ్బంది సంఖ్య పెరగనుండగా, ముఖ్యంగా ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉంటారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాలకు కలెక్టర్ నుంచి అప్రూవల్ తీసుకునేవారు. కానీ కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉండనుండటంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉండదని భావిస్తున్నారు. కార్పొరేషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రావడంతోపాటు స్థానికంగా వివిధ రకాల పరిశ్రమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కానీ కార్పొరేషన్ కాగానే తొలుత ప్రజలే పెరిగిన ఇంటి పన్నులు, పంపు బిల్లులు చెల్లించాలి. ఆ తర్వాత కార్పొరేషన్‌కు అభివృద్ధి నిధులు వస్తాయో, రావోననే అభిప్రాయం కూడా స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. దీంతోపాటు జిల్లాలో 1/70 యాక్టు ఉండటంతో అభివృద్ధి పూర్తిస్థాయిలో జరిగేందుకు వీలు ఉండదని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా కార్పొరేషన్ ఏర్పాటుపై తొలుత సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీల ప్రజలు నిరసన తెలిపారు.

కదం తొక్కిన విద్యార్థులు



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, నాయకులు

- ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- విద్యార్థుల భారీ ప్రదర్శన



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను, పక్కన మాదాల రవి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఖమ్మం వీధుల్లో విద్యార్థులు శుక్రవారం కదం తొక్కుతూ ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని జెడ్పీసెంటర్ వద్ద ప్రముఖ విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా వైరా రోడ్ మీదుగా భక్త రామదాసు కళాక్షేత్రానికి చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఎస్ఎఫ్ఐ జెండాలు, భగత్ సింగ్, చేగువెరా ప్లకార్డులు, కోలాటం, డప్పు నృత్యాలతో సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సభ ప్రారంభానికి ముందు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి జెండా ఆవిష్కరించగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు.

హెచ్‌సీయూ భూముల రక్షణపై పోరాటం..

రాష్ట్రంలోని హెచ్‌సీయూ భూముల రక్షణపై ఎస్ఎఫ్ఐ పోరాడిందని, దీంతో సంఘ నేతలపై పలు కేసులు నమోదు చేశారని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను అన్నారు. దేశంలో అనేక యూనివర్సిటీల్లో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న తమ సంఘం నేతలపై కేసులు పెడుతున్నారని చెప్పారు. హిందూ, హిందుస్థానీ అంటూ కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తోందని, బీజేపీకి, మోడీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని విద్యాలయాల నుంచి సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు. సినీ నటుడు, నిర్మాత మాదాల రవి మాట్లాడుతూ.. పోరాటాలకు చైతన్యమే ఏకైక మార్గమని అన్నారు. అభ్యుదయ శక్తులు, వామపక్షాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పోరాటాల ఖిల్లా ఖమ్మం జిల్లాకు రెడ్ సెల్యూట్ అంటూ ఉపన్యాసాన్ని ప్రారంభించిన ఆయన.. 'చదువెందుకు.. చదువెందుకురా.. నలుగురిలో దీపమై నిలిచేందుకు రా' అంటూ విద్యార్థులను ఉర్రూతలూగించారు. దాస్య శృంఖలాల నుంచి దేశానికి విముక్తి కల్పించిన భగత్ సింగ్, ప్రపంచ విప్లవాన్ని ముందుకు నడిపిన చేగువేరా.. బడుగు జీవుల కోసం పాటుపడిన అంబేద్కర్ నిజమైన హీరోలని వ్యాఖ్యానించారు. సమాజ ధోరణిలో ఎస్ఎఫ్ఐ మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ ఐవీ రమణారావు, రిసెప్షన్ కమిటీ గౌరవాధ్యక్షుడు రవిమారుత్, ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్ పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'తో జీవనోపాధి
ఐటీడీఏ పీఓ రాహుల్



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న పీఓ, అధికారులు

బూర్గంపాడు/భద్రాచలం టౌన్: రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగ యువత జీవనోపాధులు మెరుగుపడతాయని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ అన్నారు. శుక్రవారం ఆయన సారపాక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను పరిశీలించారు. గ్రామపంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అనంతరం భద్రాచలంలోని సుందరయ్య నగర్ డీఆర్‌సీసీ పక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత సుందరయ్య నగర్‌లో ఇందిరమ్మ కాలనీని సందర్శించారు. స్థలం ఉన్న లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఆదివాసీ మహనీయుల విగ్రహాల మరమ్మతులపై ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ హరీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నరసింహారావు, ఏఈ శివ, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్, సిబ్బంది రాములు, ఠాగూర్, ప్రశాంతి, మురళి పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వర్ణ కవచధారణలో రామయ్య


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఈఓ రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

నేడు శనీశ్వరునికి తైలాభిషేకం

పెద్దమ్మగుడి సముదాయంలోని శివాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వరుడికి తైలాభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

న్యాయమూర్తిని కలిసిన పోలీసులు


న్యాయమూర్తిని కలిసిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తదితరులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లును కోర్టు హాల్‌లో శుక్రవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఇతర పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐలు ఎం.కరుణాకర్, వెంకటేశ్వర్లు, శివప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న త్యాగరాజన్

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల లాభాల వాటా అందించామని, పెండింగ్‌లోని అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ అన్నారు. శుక్రవారం ఓసీ–2లో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన గేట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, వేల కుటుంబాల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉందని, దానిని కాపాడుకునే బాధ్యత కార్మికులపైనే ఉందన్నారు. సమావేశంలో మల్లికార్జున్, షాబుద్దీన్, షేక్ అబ్దుల్ రవూఫ్, బానోత్ కృష్ణ, బుర్ర వెంకటేశ్వర్లు, జయరాజు, మిట్టపల్లి శ్రీను, జీవరత్నం, రామారావు, సంతోష్ చరణ్, పాదిల రామకృష్ణ, జంపాల శ్రీను, తాళ్లూరి రాము, యాకూబ్ పాషా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000


రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..

బీఆర్‌ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్




హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్: మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్: ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్–దేవునూరు –దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు
సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్యటన


రైతులతో మాట్లాడుతున్న కార్తీక్

దమ్మపేట: సీతారామ ప్రాజెక్టు కాల్వ భూసేకరణకు నియమితులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ మండలంలోని నాగుపల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. సేకరించిన భూములను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. స్పందించిన ఆయన.. ప్రతి నిర్వాసిత రైతుకు పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మోతీలాల్, గపూర్‌పాషా, సాగర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అడ్డుకట్ట


గ్రామస్తులు అడ్డుకోవడంతో పేర్లు వెల్లడిస్తున్న సర్వే అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేస్తున్న అధికారులను శుక్రవారం కొందరు అడ్డుకున్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలచెరువు గ్రామానికి 21 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ఇందిరమ్మ కమిటీ ద్వారా వచ్చిన లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు వెళ్లిన డీటీ రామకృష్ణ, కార్యదర్శి స్వప్న, మున్సిపాలిటీ సిబ్బందిని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆ పేర్లలో అనర్హులు ఉన్నారని, అర్హులైన వారినే ఎంపిక చేయాలని వాగ్వాదానికి దిగారు. జాబితాలోని పేర్లపై అభ్యంతరాలు ఉంటే చెప్పొచ్చని, సర్వేలో నిర్ధారించి అనర్హులు ఉంటే వారి పేర్లు తొలగిస్తామని అధికారులు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

హక్కుల సాధనకు ఐక్యం కావాలి


మాట్లాడుతున్న ముక్తి సత్యం

భద్రాచలంటౌన్: హక్కుల సాధన కోసం గిరిజనులంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని అఖిల భారత ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం అన్నారు. స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని చట్టాల్లో గిరిజనులకు ఉన్న హక్కుల అమలు కోసం అందరినీ ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరిజన సమూహాల మధ్య ఉన్న తేడాలు, విభేదాలను మిత్ర వైరుధ్యంగానే భావించాలని, హిందుత్వవాదులు, కార్పొరేట్ కంపెనీ యజమానులతో కుమ్మక్కై అడవిలోని ఖనిజాలతోపాటు ఇతర సంపదను దోచుకుపోతున్నారని ఆరోపించారు. ఎదురు తిరిగితే 'కగార్'పేరుతో ఆడ, మగ తేడా లేకుండా ఊచకోతకు దిగుతున్నారని విమర్శించారు. అంతకుముందు పట్టణంలో గిరిజన నృత్యాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సదస్సులో ముర్ర వీరభద్రం, సుర్ణపాక నాగేశ్వరరావు, వేట్ల శాంతన్, కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, కృష్ణ, ఉదయ్, రజిత, భూద్ర, భూలక్ష్మి, పెంటన్న, చంద్రకళ, రాధ, సురేశ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మణుగూరు సింగరేణి అధికారులు


కలెక్టర్‌కు ఫైల్ అందజేస్తున్న అధికారులు

మణుగూరుటౌన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): గతేడాది ఆగస్టు 30వ తేదీన గొర్రెపేటవాగు వరద, సింగరేణి నుంచి వచ్చిన వరద, భారీ వర్షం కారణంగా మణుగూరు జలదిగ్బంధంలో చిక్కుకుంది. కాగా, 'ముంపుపై ముందస్తు చర్యలేవి'అనే శీర్షికన 'సాక్షి'లో గతేడాది మే 30న కథనం వచ్చింది. మణుగూరు మునకతో పట్టణంలోని ప్రధాన కాల్వలు, మొట్లు వాగు పూడిక తీయకపోవడం, సింగరేణి నుంచి వచ్చిన వరదలే ప్రధాన కారణంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జితేశ్ పాటిల్ సూచన మేరకు సింగరేణి అధికారులు రూ.82.25 లక్షలతో శుక్రవారం ఎంఓయూ చేసుకున్నారు. ఈ నిధులను కట్టువాగు, మొట్ల వాగు పూడికతీత, మున్సిపాలిటీ ముంపునకు గురికాకుండా వినియోగించనున్నారు. కార్యక్రమంలో సంజీవరావు, ధనసరి వెంకటేశ్వర్లు, రమేశ్ పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కల పరిశీలన


మొక్కలను పరిశీలిస్తున్న జంగా రాఘవరెడ్డి

దమ్మపేట: మండలంలోని జగ్గారం గ్రామ పరిధిలోని రైతుల పామాయిల్ క్షేత్రాల్లో అంతగా దిగుబడి రాని ఆఫ్‌టైప్ మొక్కలను తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఐఐఓపీఆర్ విశ్రాంత శాస్త్రవేత్త బీఎస్.రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. జన్యులోపం, విత్తనలోపం, పెంపకంలో లోపాలు తదితర కారణాల వల్ల ఆఫ్‌టైప్, నాణ్యత లేని మొక్కలు వచ్చి ఉండవచ్చని శాస్త్రవేత్త తెలిపారు. దిగుబడి లోపంపై పూర్తిస్థాయిలో పరిశోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. గాద్రెజ్ కంపెనీ ద్వారా మొక్కలు తెచ్చి, సాగు చేసిన క్షేత్రాల్లో ఆఫ్‌టైప్ మొక్కలు రాలేదని, ఆయిల్ ఫెడ్ నర్సరీ మొక్కల్లోనే అధికంగా ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయని, అవకతవకలకు పాల్పడిన అధికారులపై తగు చర్యలు తీసుకుని, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో జీఎం సుధాకర్‌రెడ్డి, డివిజనల్ నర్సరీ మేనేజర్ రాధాకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కల్యాణ్, నాగబాబు, ప్రవీణ్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు తుంబూరు ఉమామహేశ్వరరావు, కొక్కెరపాటి పుల్లయ్య, చెలికాని సూరిబాబు, కారం శ్రీరాములు, మడివి బాలరాజు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

240 గ్రాముల బంగారం స్వాధీనం


వరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ కాలనీలో ఉద్యోగుల క్వార్టర్లలో చోరీలు జరిగిన ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. ఒకరిని పట్టుకుని నగదు స్వాధీనం చేసుకోగా.. తాజాగా మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించారు. గత జనవరి 25వ తేదీ అర్ధరాత్రి నవభారత్ కంపెనీ ఉద్యోగుల క్వార్టర్లలో తాళాలు వేసి ఉన్న వాటిల్లోకి చొరబడిన దుండగులు నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసులు ఘటనాస్థలంలో దొరికిన ఆధారాలతో మధ్యప్రదేశ్‌కు చెందిన అనిల్‌సంఘూర్‌ను గతంలోనే అరెస్ట్ చేసి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనిల్‌సంఘూర్‌కు బెయిల్ ఇప్పించడం కోసం కొత్తగూడెం కోర్టుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా, తండా పోలీస్ స్టేషన్ పరిధిలోని పింటు భవార్, శోభన్‌సింగ్ పోలంకిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల్లో వీరి హస్తం ఉన్నట్లు తేలిందని డీఎస్పీ చెప్పారు. వీరి నుంచి 240 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక స్మార్ట్‌ఫోన్, కీపాడ్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామని ఆయన వివరించారు. సమావేశంలో సీఐ సతీశ్, ఎస్‌ఐలు సుమన్, ప్రవీణ్, రాఘవయ్య, జీవన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పర్సనల్ విభాగం జీఎం కవితానాయుడు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు 18 సంవత్సరాల లోపువారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శనివారం నుంచి మే 20వ తేదీ వరకు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం, సీఈఆర్ క్లబ్‌లో శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాక్సింగ్, ఉషు, కరాటే, డ్రాయింగ్ విభాగాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగినవారు నేటి సాయంత్రం ప్రకాశం స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

పురుగులమందు తాగిన దంపతులు

చికిత్స పొందుతూ భార్య మృతి


దీపిక (ఫైల్)

టేకులపల్లి: కుటుంబంలో గొడవలు, మనస్పర్ధల కారణంగా దంపతులు పురుగులమందు తాగారు. గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించడంతో భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని రేగులతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ దీపిక (19), వెంకట్యాతండాకు చెందిన బోడా శ్రీను ఆరు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం దీపిక మూడు నెలల గర్భవతి. రెండు నెలల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం బోడ శ్రీను కుటుంబ సభ్యులతో దీపికకు గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన బోడ శ్రీను, దీపిక కూల్‌డ్రింక్‌లో క్రిమిసంహారక మందులు కలుపుకుని తాగారు. కుటుంబ సభ్యులు ఇద్దరినీ కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. దీపిక శుక్రవారం మృతి చెందింది. శ్రీను పరిస్థితి విషమంగా ఉంది. ఇదిలా ఉండగా బోడ శ్రీను, అతడి కుటుంబ సభ్యులు బోడ చిలికి, బోడ వీరు, బోడ వెంకన్న, ఫారు, సునీత, భూక్యా శ్రీను అదనపు కట్న కోసం వేధించడంతోనే తన కుమార్తె దీపిక ఆత్మహత్య చేసుకుందని ఇస్లావత్ వత్మల్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సొసైటీ డైరెక్టర్ మృతి

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో కామేపల్లి పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. జాస్తిపల్లి గ్రామానికి చెందిన దేవండ్ల యాదగిరి (53) శుక్రవారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లి పని ముగిసిన తరువాత తన మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ముచ్చర్ల రైతువేదిక సమీపంలో మద్దులపల్లి గ్రామానికి చెందిన రెల్లా గోపాల్‌రెడ్డి తన మోటార్ సైకిల్‌తో వేగంగా దూసుకొచ్చి యాదగిరి బైక్‌ను ఢీకొట్టాడు. యాదగిరి తలకు తీవ్ర గాయం కాగా.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు నారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని జగదీశ్‌కాలనీలో విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్న ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతంతో గాయపడ్డారు. కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఖమ్మానికి చెందిన కాంట్రాక్టు కార్మికులు శ్రీను, సతీశ్.. విద్యుత్ సరఫరా నిలిపివేసి మెయింటెనెన్స్ పనులు చేస్తున్నారు. వేరే ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వీధి దీపాలకు సంబంధించిన లైన్ ఈ ట్రాన్స్‌ఫార్మర్ వరకు ఉంది. వీధి దీపాలను ఆన్ చేసిన సందర్భంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. షాక్‌కు గురైన ఇద్దరిని సిబ్బంది, స్థానికులు భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

మూడు ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అల్లిగూడెం శివారు నుంచి అశ్వారావుపేట వైపు మట్టితో వస్తున్న మూడు ట్రాక్టర్లను పేరాయిగూడెం వద్ద పట్టుకున్నారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పిన కారు

గుండాల: కారు అదుపుతప్పి పలువురికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని నర్సాపురం తండాలో జరుగుతున్న ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరుగు పయనమైన మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వీరన్న కారులో తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మూలమలుపులో చెట్టును ఢీకొనగా.. వీరన్న భార్య సునీత, కార్తీక్‌కు స్వల్ప గాయాలు కాగా.. తండ్రి హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. ఇదిలాఉండగా.. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనం పైనుంచి పడి గాయపడిన ఘటన కూడా శుక్రవారం చోటుచేసుకుంది.

పేకాట స్థావరంపై దాడి

భద్రాచలంఅర్బన్: పట్టణ పరిధిలోని కరకట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్లు సీజ్ చేశామని ఎస్‌ఐ స్వప్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూర్గంపాడు: సారపాక – బూర్గంపాడు రహదారిలో ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆటోడ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఉదయ్‌కిరణ్ మృతదేహం

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మామిళ్లగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పెద్దారపు రాజేశ్, పలగాని ఉదయ్‌కిరణ్ (16) ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మండలంలోని మామిళ్లగూడెం సమీపంలో బైక్ కుక్కను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఉదయ్‌కిరణ్ ఎగిరి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేశ్ స్వల్పగాయాలు కాగా.. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

పురుగులమందు తాగి లారీడ్రైవర్ ఆత్మహత్య


బాలు (ఫైల్)

టేకులపల్లి: పురుగులమందు తాగి లారీడ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండాకు చెందిన బాదావత్ బాలు (55) అలియాస్ కృష్ణ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి గ్రామంలో ఉన్న తన మొక్కజొన్న చేనులో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను కొత్తగూడెం.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బాదావత్ శ్యాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంటికి ఆహారం... వ్యాయామం

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్డు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి.. పదును పెట్టండి





వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయొచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒక సారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహదపడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.





టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు.. ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్‌లుగా మార్చుకోండి,

కావలసినవి: రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.

బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాప్‌ల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కోల్లెజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.

సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు.

కావలసినవి: పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్‌లు.

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.



పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో 'రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్'ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి. వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

● యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణాయామ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.

భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెర పైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మొంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!

- సమంత

''జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ- ''నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

తన కోసమే నా పొగరే అణిగేనా...



● నాని

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

''శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ- ''ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం'' అని చెప్పారు. ''మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది'' అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

''కలియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ | ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేతలందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉర్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ నట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మాములు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్



– హరికృష్ణ ఇంటూరు